క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



మదనాపురం: మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఆరు నిర్ణయాల గ్యారెంటీ కార్డులను ప్రతి ఇంటికి తిరిగి పంపిణీ చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 హామీలను నెరవేరుస్తామని స్పష్ట చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్, నాయకులు రామకృష్ణ, కుమార్, శేఖర్‌రెడ్డి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



కొత్తకోట: ఎనిబెర అశోక్ చక్రవర్తి 27వ జయంతిని పురస్కరించుకుని బెనివోలెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ మండల అధ్యక్షుడు వై.నతానియేల్, కేఎస్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు షిమియాసోన్, సుందర్, విలియమ్స్, చంద్రబాబు, శాంతిప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: మండలంలోని జనుంపల్లికి చెందిన గొల్ల చిన్నమ్మ ఆకస్మికంగా రెండు రోజుల క్రితం మృతి చెందింది. శుక్రవారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాసులు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, రాములు యాదవ్, రంజిత్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వాల్ పెయింటింగ్ తొలగింపు



మదనాపురం: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలో రెండు రోజులుగా ఆయా పార్టీల బ్యానర్లు, వాల్ పోస్టర్లు, రాజకీయ పార్టీల గుర్తులకు ముసుగు వేస్తున్నారు. అక్కడక్కడ కట్టిన జెండాలను తొలగిస్తున్నారు. గోడపై రాసిన పార్టీ గుర్తులపై సున్నం వేస్తున్నారు. శుక్రవారం గోపన్‌పేట, దుప్పల్లి, మదనాపురం, దంతనూరు గ్రామాల్లో వాటిని పూర్తిస్థాయిలో తొలగించారు.

పోలింగ్ బూత్‌లో వసతుల పరిశీలన



అమరచింత: పట్టణంలోని పోలింగ్ బూత్‌లను అధికారులు శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. తాగునీటితో పాటు విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల వసతులు గురించి ఆర్‌ఐ గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో వెంటనే వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. పాఠశాల ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడమే కాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

వీపనగండ్ల: ఎన్నికల నిబంధనలను అనుసరించి ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మికాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మృతిచెందిన ఓటర్లను గుర్తించడం, దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన ఓటర్ల జాబితాను తయారుచేసి సంబంధిత అధికారులకు అందించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింతలో నీటి తొట్టిల్లోని నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



శాగాపూర్‌లో..



పెబ్బేరులో నిల్వనీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

అమరచింత: పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని ఏఎన్‌ఎం నర్సింగమ్మ అన్నారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ముంగిట ఉన్న నీటి తొట్టిల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచడం ద్వారా దోమలు వ్యాప్తి చెంది డెంగీ లాంటి విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. పాడైన కూలర్లు, ప్లాస్టిక్ డబ్బాలను డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. ప్రతి రోజు కుళాయి ద్వారా వచ్చే నీటిని వినియోగించుకోవాలని, నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదన్నారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా ఉండవచ్చొని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు శాగాపూర్, వెంగళాయిపల్లి గ్రామాల్లో డ్రై డేలో భాగంగా శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ, కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. నిల్వ నీటిలో దోమల నివారణ మందులను (అబేట్ ద్రావణం) కలిపారు. దీంతో పాటు పరిసరాల్లో నిలిచిన నీటిలో, పెంట కుప్పల్లో బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయించారు. మంచినీటి పైపులైన్ల లీకేజీలను గుర్తించి వాటిని మరమ్మతు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు రాంచంద్రయ్య, సతీష్, నర్సమ్మ, ఏఎన్‌ఎం సుమిత్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని 10వ వార్డులో ఏఎల్‌ఓ టీంతో కలిసి ఆంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. వార్డులో తిరుగుతూ హౌజ్‌ల్లో నిల్వ నీటిని పారపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు బారిన పడే అవకాశం ఉందన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్‌ఎం వెంకటమ్మ, బ్రీడింగ్ చెక్కర్ నరసింహ, ఆశా కార్యర్తలు, లార్వా టీం సభ్యులు పాల్గొన్నారు.

10 రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా



ఏఈ మొగులయ్యను నిలదీస్తున్న ఏదుట్ల గ్రామస్తులు

గోపాల్‌పేట: పది రోజులుగా మిషన్ భగీరథ నుంచి సరఫరా అయ్యే తాగునీరు గ్రామంలో రావడం లేదని ఏదుట్ల గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మిషన్ భగీరథ ఏఈ మొగులయ్యకు ఫోన్ చేసి గ్రామానికి పిలిపించారు. పది రోజుల నుంచి గ్రామానికి తాగునీరు రాకుంటే ఎవరిని అడగాలని నిలదీశారు. ప్రతిరోజు నీరు ఇస్తామని చెప్పుకునేదే కానీ పది రోజులుగా నీటి సరఫరా లేకున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. పెద్దల పండుగలు జరుగుతున్న తరుణంలో ఇంటికి చుట్టాలు వస్తే నీరు రావడం లేదని చెప్పేందుకు సిగ్గనిపిస్తోందని వాపోయారు. ఇదే విషయం ఏఈ మొగులయ్యను వివరణ కోరగా.. ఏదుట్ల గ్రామానికి ఉదయం వెళ్లి సమస్యను పరిశీలించానని, మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి సమస్యను పరిష్కరించి వచ్చినట్లు తెలిపారు.

ఆడపడుచులకు అండగా బీఆర్‌ఎస్



సింగిరెడ్డి వాసంతి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలు, మహిళా టైలర్లు

కొత్తకోట రూరల్: ఆడబిడ్డలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందని, చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందని బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి వాసంతి అన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి, మంగంపల్లి గ్రామాల నుంచి మహిళలు, మహిళా టైలర్లు శుక్రవారం సింగిరెడ్డి వాసంతి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పెబ్బేరు రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించేదుకు కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి వాసంతి అన్నారు. శుక్రవారం ఉదయం పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సూగూరులో ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడుగుతూ, మంత్రి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ పద్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, సర్పంచ్‌లు వెంకటస్వామి, వెంకటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు తదితరులు పాల్గొన్నారు.

‘అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా’



మోటార్లను ప్రారంభిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కత్తేపల్లిలో డీ–6 కెనాల్ వద్ద సాగునీటిని అందించే మోటార్లను ప్రారంభించారు. గ్రామానికి చెందిన 30 మంది దళిత రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వర్కటం దృష్టికి తీసుకెళ్లారు. డీ–6 కాల్వ నుంచి నీటిని తరలించేందుకు సహకరించాలని కోరడంతో రూ.1.75 లక్షలు వెచ్చించి రెండు 5 హెచ్‌పీ మోటార్లు, స్టాటర్లు, పైపులను రైతులకు అందజేసి ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులు వర్కటం జగన్నాథ్‌రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు కుర్మన్న, తిరుపతి, నర్సింహ, అర్జున్, బసన్న, దాసన్న, విష్ణు, కొండన్న, ఎల్లన్న, లక్ష్మన్న, నాగరాజు, గోపాల్, రామకృష్ణ, భాను ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

గోపాల్‌పేట: విద్యుదాఘాతంతో యువకుడు గాయాలపాలైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన శివ ప్రతినెలా కరెంటు బిల్లులు కొట్టేవాడు. స్థానిక లైన్‌మెన్ అంజి వద్ద టెంపరరీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బుద్దారం, పొలికెపాడు ఫీడర్ సబ్‌స్టేషన్ సమీపంలో పోల్‌పైన పనిఉండి లైన్‌మెన్ ద్వారా ఎల్‌సీ(లైన్ క్లియర్) తీసుకుని కరెంటు పోల్ ఎక్కి వైర్లు సరిచేస్తున్నాడు. అనుకోకుండా కరెంటు రావడంతో కరెంటు షాక్‌కు గురై పోల్ పైనుంచి కింద పడిపోయాడు. దీంతో దవడ, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్నవారు వెంటనే అతడిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేందర్



గుమ్మడంలో..

ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్థానిక గాంధీచౌక్‌లో, పరమేశ్వరస్వామి చెరువు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియామవళి, ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

బెల్టు షాపులో..

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడంలో శుక్రవారం ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బెల్టు షాపులపై దాడులు చేయగా 20 లీటర్ల మద్యం పట్టుబడింది. వీటి విలువ దాదాపు రూ.8,400 ఉటుందని అంచనా వేశారు. కూల్‌డ్రింక్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నేతుల రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

శేరుపల్లిలో..

శేరుపల్లిలో బెల్టు షాపులపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించి, మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాల ప్రకారం శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో చటమోని నరసింహ, రామచంద్రయ్య, శంకరమ్మ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పోలీసులు సోదా చేయగా వారి నుంచి 84 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ 39,310 ఉంటుందని అంచనా వేశారు.

క్షయపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: టీబీ వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే రోగం నయమవుతుందని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని వెంగళాయిపల్లిలో టీబీ వ్యాధి నివారణపై గ్రామంలో అవగాహన కల్పించి అనుమానితుల నుంచి తెమడను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తెమడ పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని సూచించారు. వ్యాధి సోకిన వారు బయట తిరగకూడదని, ఉమ్మరాదన్నారు. వ్యాధి పూర్తిగా నయమయ్యే వరకు పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 అందిస్తారని పేర్కొన్నారు. మరుగుదొడ్లను తప్పక వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, నర్సమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరడం పక్కా

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం పక్కా అని గుల్బర్గా రూరల్ ఎమ్మెల్యే బస్వరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ఆయన చెప్పే మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ వారు కొత్తగా 6 గ్యారంటీ పథకాలు అంటూ గ్రామాల్లోకి వస్తున్నారని, వాళ్లను నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులుగౌడ్, పార్లమెంట్ విస్తారక్ బుడ్డన్న, మండల ఇన్‌చార్జ్ శ్రీశైలం, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, రాంరెడ్డి, ఆశన్న, అంజనేయులు, శివశంకర్, రాంచందర్, సత్యనారాయణ, ఈదమ్మ, శాంతమ్మ, గోపి, గోపాల్‌రెడ్డి, సుంకరి అంజనేయులు, దశరథ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పథకాలకు మినహాయింపు ఇవ్వాలి

పాన్‌గల్: రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలలో అత్యవసర పథకాలకు ఎన్నికల కోడ్ నుంచి మినహాయింపు ఇచ్చి పేదల ఇబ్బందులు తొలగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ కోరారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఎన్నికల కోడ్ పేరుతో తాత్కాలికంగా నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించడంతో పేదలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆసరా పింఛన్లు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలకు నిలిచిపోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిత్యావసరాలు, మందులు, ఆస్పత్రి ఖర్చులకు ప్రతి నెల వచ్చే ఆసరా పింఛన్లపైనే చాలా మంది పేదలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వాటి నిలుపుదలతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా పథకాలపై కేంద్ర ఎన్నికల సంఘం పున:పరిశీలించాలని కోరారు. దీంతో పాటు రైతులకు అందించే 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని, సాగునీటి కాల్వల ద్వారా వచ్చే సాగునీరు చివరి ఆయకట్టు గ్రామాల రైతులకు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో డంగు కుర్మయ్య, కుర్వ హన్మంతు, చిన్నరాముడు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓ బద్రీనాథ్‌కు నివాళి



ఎంపీఓ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బద్రీనాథ్‌ను 10 రోజుల క్రితం దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంపీఓ చిత్రపటానికి కార్యాలయ ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ విధులను నిర్వహిస్తున్న ఎంపీఓను హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఐదేళ్లుగా మండలంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, కార్యాలయ, ఈజీఎస్ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి



మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీఓ

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ నరసింహులు అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శుక్రవారం వాటరింగ్ డే కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కలకు నీటిని అందిస్తున్నామని, వీటితో పాటు ప్రతి రోజు పంచాయతీ ట్యాంకర్ ద్వారా రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని క్రమం తప్పకుండా అందించాలని కార్యదర్శులకు సూచించారు. వాడుముఖం పట్టిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో మరో మొక్కను నాటాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్టీయూ నిరంతరం పోరాడుతుందని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గసర్లు, జిల్లా అధ్యక్షుడు తలకంటి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి అర్బన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూర్యశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, సహ అధ్యక్షుడిగా గోపాలకృష్ణ యాదవ్, ఉపాధ్యక్షుడిగా బాలీశ్వరయ్య, మహిళా ఉపాధ్యక్షులు అనిత, ఎస్‌కే వనజశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కార్యదర్శి మద్దిలేటిని, అదే విధంగా అర్బన్ నుంచి జిల్లా కమిటీకి జిల్లా మహిళా అధ్యక్షురాలు సరస్వతి, మహిళా కార్యదర్శిగా రాజేశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులకు గసర్లు, మహిపాల్‌రెడ్డి, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో వైరాలగుట్టపై వెలసిన శివాలయంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. రాకాసి యాదవరెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ మండలంలో దుర్గామాతం విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని గ్రామస్తులు, భక్తులు పాల్గొనిఅమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఐక్యతతో సాగుదాం

అమరచింత: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం నుంచి ఈసారి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకుందామని టీపీసీసీ గౌడ సంఘం రాష్ట్ర కన్వీనర్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిగా శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కేశం నాగరాజ్‌గౌడ్‌ను నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శ్యాం, తౌఫిక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం ‘బతుకమ్మ’



వనపర్తిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



పాన్‌గల్‌లో బతుకమ్మలతో చిన్నారులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎమ్మార్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మను చేసి, ఆటపాటలతో బొడ్డెమ్మలు కొట్టారు. విద్యా సంస్థలకు దసరా సెలవులను ప్రకటించిన నేపథ్యంలో కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు చంద్రమౌళి, చాంద్‌పాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాన్‌గల్‌లో..

పాన్‌గల్: మండల కేంద్రంలోని కేఎం గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు, రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాఠశాల ఆవరణలో బొడ్డెమ్మలు కొట్టారు. అనంతరం బతుకమ్మలను పాఠశాలల విద్యార్థులు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. బతుకమ్మ పండుగను తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా జరుపుకొంటామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వహీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టు నిబంధనలు ఉల్లఘించిన వ్యక్తికి జైలు శిక్ష

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆత్మకూర్ సివిల్ కోర్టు జడ్జి శిరీష జైలుశిక్ష విధించారు. కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 2014లో నాటవెళ్లి ఎన్‌హెచ్44పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ షణ్ముగ లారీని అజాగ్రత్తగా నడపడంతో బొలేరో వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఆత్మకూర్ మండలం జూరాల గ్రామానికి చెందిన ఆంజనేయులు అక్కడిక్కడే మృతి చెందాడు. అప్పట్లో స్టేషన్ బెయిల్‌పై వచ్చిన లారీ డ్రైవర్ విచారణ నిమిత్తం కోర్టుకు హాజరు కాకపోవడంతో అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తన సిబ్బందితో నిందితుడి గురించి వెతకగా.. గురువారం రాత్రి నల్గొండ జిల్లా భువనగిరి వద్ద షణ్ముగను అరెస్టు చేశారు. శుక్రవారం ఆత్మకూర్ కోర్టులో షణ్ముగను హాజరు పర్చగా జడ్జి శిరీష 14రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని మహబూబ్‌నగర్ జైలుకు పంపించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో..

అమరచింత: మద్యం తాగి వాహనం నడిపిన యువకుడిని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకుని కోర్టులో హాజరు పర్చగా ఆత్మకూర్ సివిల్ కోర్టు జడ్జి శిరీష ఒక రోజు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ జగన్మోహన్ శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన ఎనుముల శ్రీకాంత్ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయగా.. మద్యం మోతాదు ఎక్కువగా ఉండడంతో కేసు నమోదు చేసి నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరు పర్చారు. దీంతో జడ్జి ఒక రోజు పాటు జైలు శిక్ష విధించారని వెల్లడించారు.